# డు యు లవ్ మి?

- మూర్తి భావరాజు

తెలుగు జ్యోతి కథల పోటీలు "ప్రేమ" మీదట! అది చదివాక ఒక రోజు ప్రొద్దున్నే మా ఆవిడ "డు యు లవ్ మి?.... డు యు లవ్ మి?" అని పాడడం మొదలు పెట్టింది. ఇదీ 1970 ప్రాంతాలలో బ్రాడ్ వేలో ఆడిన "ఫిడ్లర్ ఆన్ ది రూఫ్" నాటకంలో భర్త భార్యను ప్రశ్నిస్తూ పాడిన పాట. ఆ భార్య అంటుంది. "నీ పిల్లల్ని కన్నాను, పెంచుతున్నాను; రోజూ ఆవులకు పాలు పితుకుతాను; బట్టలుతుకుతాను; ఇల్లు శుభ్రం చేసి, అందరికీ వంట చేస్తాను" అని, "ఇవన్నీ చేస్తూంటే అది ప్రేమించడం కాదా" అని అడుగుతుంది.

---

నాటకం అంటే చిన్నప్పుడు విన్న రెండు జోకులు గుర్తుకు వస్తున్నాయి. "ఆ సినిమాలో హీరో ఆ అమ్మాయిని ఎంత చక్కగా ప్రేమిస్తున్నాడో చూడండి... మీరూ ఉన్నారు!" అంటుంది భార్య. భర్త జవాబిస్తాడు" అవును. వాడికి పది లక్షలు ఇస్తున్నారు అలా నటించడానికి."

మరొకటి "ఈమధ్య ఆహీరో-హీరోయిను అంత బాగా నటించలేదోయ్". "అవును. మరి ఈ మధ్యనే వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుని భార్యా, భర్తలు అయారుగా!"

---

మాకు పెళ్ళయి 43 సంవత్సరాలు అయింది. మా ఆవిడకి (ఆవిడేమిటి, అమ్మాయికి) 19 సం॥ వచ్చినప్పటి నుంచి వాళ్ళ నాన్నగారు మానాన్నగారితో మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోండి అని బొంబాయి నుంచి విశాఖపట్నం వచ్చినప్పుడల్లా అంటూండేవారు. మా నాన్నగారు మావాడు ఇంకా చిన్నవాడు (23) అంటూండేవారు. ఇలా రెండేళ్ళు గడిచింది. చివరికి నేను పిహెచ్.డి. కి కెనడా వెళ్ళే ముందు ఈ విశాఖపట్నం అబ్బాయికి, ఆబొంబాయి అమ్మాయికి పెళ్ళయిపోయింది (ఈ విశాఖపట్నం అబ్బాయి కెనడా వెళ్ళి ఏతెల్లమ్మాయి నో చేసుకుంటాడని భయపడ్డారేమో!) "ప్రేమ పెళ్ళి, ప్రేమ లేని పెళ్ళి కంటె మెరుగే కద!"

---

కెనడాలో మొదటి పెళ్ళి రోజు(anniversary)'న మా ఆవిడ అలకపానుపు ఎక్కింది. మొదట అర్థం కాకపోయినా నాకు తరువాత తెలిసిందేమిటంటే నేను ఆరోజు గుర్తు పెట్టుకొని ఏమీ చేయలేదని. విశాఖపట్నంలో మా అమ్మ, నాన్న గారు పిల్ల పుట్టినరోజులు జరిపారు గాని వాళ్ళ anniversary లు జరుపుకోలేదు. నెమ్మదిగా ఈ బొంబాయి అలవాటు నేర్చుకున్నాను. ఈ మధ్య ఒకమాటు happy anniversary చెప్తే "అవును కదూ, నాకు గుర్తు లేదు" అంది.

ఇంకా ఆలోచిస్తున్నాను "డు యు లవ్ మి"కి జవాబు ఏమి చెప్పాలా అని. ఆ బ్రాడ్వేప్లేలోని భార్య strategy ఉపయోగించాను. "మనందరికి కావలసిన ఇల్లు, తిండి, బట్టలకు అవసరమైన డబ్బు సంపాదిస్తున్నాను. పాటలు, నాట్యం సినిమాలాంటి కార్యక్రమాలకి వెళ్తున్నాం. హవాయి, అలాస్కా, ఆస్ట్రేలియాలాంటి ప్రదేశాలకి నిన్ను తీసుకువెళ్ళాను. ఎప్పుడు అనుకుంటే అప్పుడు ఇండియాకి పంపుతున్నాను. ఇవన్నీ ప్రేమకి చిహ్నం కాదా?"

Telugu Jyothi Special Issue April 08

అనడిగాను.

"ఆ... అందరూ చేస్తున్నారు ఇవన్నీ" అని జవాబిచ్చింది మా ఆవిడ.

"మనపిల్లలకి చెరొక లక్ష డాలర్లతో మంచి కాలేజీ చదువులు చెప్పించాను. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు బాగానే జరిపించాం. వాళ్ళ పుట్టినరోజులకి, వాళ్ళ భర్తల, పిల్లల పుట్టినరోజులకి పెద్ద బహుమతులు ఇస్తూంటాం. ఇవన్నీ నీమీద, కుటుంబంలో అందరి మీదా నా ప్రేమని సూచించవా?"

దీనికి సమాధానం "అది మీధర్మం. పిల్లలకి చదువు చెప్పించడం, వాళ్ళ పుట్టినరోజులకి ఏదో ఇవ్వడంలో గొప్పేమిటి?"

---

ఈ ప్రశ్నకి జవాబు చెప్పడం సులభంగా తీరే సమస్యలా లేదు. నా strategy మార్చాను.

"మరి మనం ఎక్కడికైనా వెళ్ళి ఆలస్యంగా వచ్చినప్పుడు నువ్వు బద్ధకించి వారంనుంచి ఫ్రీజర్లో ఉన్న కూర వేడిచేసి పెడితే నేను ఏమీ అనకుండా తినడం ప్రేమ కాదా?"

"నువ్వు ఆస్పత్రిలో సర్జరి తరువాత కోలుకొంటున్నప్పుడు చేయి పట్టుకుని కారిడార్లో నడిపించడం ప్రేమ కాదా?

"ఆస్పత్రినుంచి ఇంటికి వచ్చాక మూడు వారాలు వంట పని, ఇంటిపని చేయకూడదని డాక్టరు చెప్పినప్పుడు మెన్యు ప్లాన్ చేసి, మన మిత్రులకు ఫోనులు చేసి రోజూ నాకు (నీకూ) ఇష్టమైన వంటలు తెప్పించడం ప్రేమ కాదా?"

ఈ ధోరణి వింటూ మా ఆవిడ కోపంగా చూస్తోంది. ఇక చివరి ప్రయత్నం చేశా ఇలా.

---

"నువ్వు ప్రొద్దున్నే లేచి ఫామిలీ రూంలో కూచుని, టి.విలో వార్తలు చూస్తున్నప్పుడు నేను కాఫి కలిపి నీచేతికందిస్తాను నువ్వు సోఫాలోంచి లేవనక్కరలేకుండా. అదే సమయంలో నేను కాఫీ తాగుతూ మనం 'లోకాభిరామాయణం' మాట్లాడుకుంటాం ఒక అరగంటసేపు... నా ఆఫీసు పనులతోనూ, నీ సోషల్ కేలెండర్-మనవల డ్యూటీలతోనూ మునిగిపోయేముందు," అని "ఇదైనా ప్రేమంటావా?" అని అనబోయేలోపుగా మా ఆవిడ విప్పారిన ముఖంతో, "now you are talking... ఇప్పటికి మీకు అర్థం అయింది. 43 ఏళ్ళ తరువాత కావలసింది కూర్చుని తీరికగా మాట్లాడుకోడం. ఇప్పుడు ఇదే ప్రేమకు చిహ్నం" అంది.

---

"ఫిడ్లర్ ఆన్ ది రూఫ్"లో భార్య సమాధానం విని "అవును, నిజమే. నువ్వు నన్ను ప్రేమిస్తున్నట్టే. నేను ఈ ప్రశ్న అడిగాక, నువ్వు జవాబు చెప్పాక వచ్చిన సంతృప్తి వేరు" అని సంతోషిస్తాడు భర్త.

***మూర్తి భావరాజు***

తెలుగు జ్యోతి ప్రధాన సంపాదకులు. వృత్తిరీత్యా ఎలక్ట్రికల్ ఇంజనీర్.
శ్రీమతి భారతి గారితో కలిసి బ్రిడ్జివాటర్ న్యూజెర్సీలో నివాసం.



Telugu Jyothi Special Issue April 08